క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో మైనంపల్లి



మొక్కు తీర్చుకుంటున్న మైనంపల్లి

గజ్వేల్: మండలంలోని దిలాల్‌పూర్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో శనివారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొన్నారు. నాగప్రతిష్ఠ చేసి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సంతోష్‌రెడ్డి, కోశాధికారి రాజేశంగుప్తా, కార్యదర్శి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అరుణోదయ' 50 వసంతాల సభ రేపు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

దుబ్బాక: హైదరబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 12న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల సభ నిర్వహించనున్నట్టు రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు ఎల్లం తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను దుబ్బాకలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1974, మే 12న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అమరులు చంద్రశేఖర్, ప్రసాద్‌ల చొరవతో అరుణోదయ సమాఖ్య ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి బూటకపు ఎన్‌కౌంటర్లు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యార్థి, మహిళలు, ఆదివాసులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షాదుల్లా, ప్రభాకర్, రవి, రాజు, సునీల్ పాల్గొన్నారు.

ఆసుపత్రి భవనంపై రెడ్ క్రాస్ లోగో



ప్రభుత్వాసుపత్రి భవనంపై రెడ్ క్రాస్ సింబల్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆస్పత్రి భవనంపై రెడ్ క్రాస్ లోగో పెయింట్ వేయించినట్లు ఆర్ ఎంఓ డాక్టర్ హరికిషన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. జెనీవా ఒప్పందం ప్రకారం ఆస్పత్రులు, మరి కొన్ని ప్రదేశాల్లో దాడులు జరపకూడదనే ఉద్దేశ్యంతో ఈ సింబల్ వేయించామన్నారు. అత్యవసర సేవలు, మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్యులు, సిబ్బందికి సెలవులు కూడా రద్దుచేశారని చెప్పారు.

దాతల సహకారం అవసరం



ఈఓ అన్నపూర్ణకు చెక్కు అందిస్తున్న శ్రీనివాస్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ ఈఓ అన్నపూర్ణ కోరారు. ఆలయంలో 100 గదుల నిర్మాణానికి కరీంనగర్‌కు చెందిన భక్తుడు ఉప్పల శ్రీనివాస్ రూ.15 లక్షల చెక్కును శనివారం అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యం కోసం దాతల సహకారంతో ఆలయంలో 100 గదుల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ నిర్మాణానికి సుమారు రూ.17 కోట్లు అవసరం ఉందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ధర్మకర్త అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్: సంతోషిమాత దేవాలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి రామక పవన్‌శర్మ గణపతి, నవగ్రహ పూజలు, కలశ స్థాపన, హోమం చేపట్టారు. అనంతరం లలిత సహస్ర నామ పారాయణం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి అశోక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రజిత, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వచ్చేనా?

ఆశావహుల్లో ఆందోళన

- వేలల్లో దరఖాస్తులు, వందల్లో సర్వే
- అన్ని గ్రామాల్లోను ప్రారంభం



ఘణపూర్‌లో సర్వే చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మణప్ప

నంగునూరు(సిద్దిపేట): పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అందని ద్రాక్షలా మారనుంది. వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఈ నేపథ్యంలో సర్వే జాబితాల్లో చాలా చోట్ల నిజమైన లబ్ధిదారుల పేర్లు లేవని ఆందోళన మొదలైంది. తమ పేర్లు లేవని, తమకు ఇళ్లు మంజూరు చేస్తారో లేదోనని వారంతా ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నంగునూరు మండలంలో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అధికారులు 23 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 961 మంది జాబితా విడుదల చేసి సర్వే చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ లక్ష్మణప్ప, ఎంపీఈఓ ప్రభాకర్‌రావు, ఎంఈఓ దేశిరెడ్డి, వ్యవసాయ అధికారి గీతను సర్వే అధికారులుగా నియమించారు. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ వారం రోజులుగా అన్ని గ్రామాల్లో సర్వే చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు కాని నంగునూరులో అత్యధికంగా 192, మగ్దుంపూర్‌లో 82 మంది పేర్లు రావడం గమనార్హం.

పైలెట్ ప్రాజెక్టుగా నాగరాజుపల్లి

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి పథకాలను అందించేందుకు ప్రభుత్వం ఒక్కో మండలం నుంచి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. ఇందులో భాగంగా నాగరాజుపల్లిని ఎంపిక చేయగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 185 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హత పత్రాలను పరిశీలించిన అధికారులు 120 మందిని అర్హులుగా తేల్చారు. ఇళ్లు కట్టుకుంటామని చెప్పిన 52 మందికి ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం11 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు.

రాజరాజేశ్వర.. కరుణించరారా..

- బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం
- మూడు రోజుల పాటు విశేష కార్యక్రమాలు



ముస్తాబైన దుబ్బరాజేశ్వర స్వామి ఆలయం

దుబ్బాక: భూంపల్లి–అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లిలోని దుబ్బరాజేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ప్రతియేటా వైశాఖ శుద్ధ పౌర్ణమి నుంచి మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీ. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం మధ్యాహ్నం పార్వతి దుబ్బరాజేశ్వర స్వాముల కల్యాణం కనుల పండువగా నిర్వహిస్తారు. శుక్రవారం స్వామి రథోత్సవం జరుగుతుంది. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, సిరిసిల్ల, జనగామ జిల్లాల నుంచి అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్వయంభుగా 400 యేళ్ల క్రితమే వెలసిన దుబ్బరాజేశ్వర స్వామిని చాలా మంది తమ ఇలవేల్పుగా కొలుస్తారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం.

– దుబ్బరాజం శర్మ, ప్రధాన అర్చకులు

వైభవం.. బొడ్రాయి ప్రతిష్ఠోత్సవం



బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహిస్తున్న గ్రామస్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని అలిరాజపేటలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆడపడుచులంతా బొడ్రాయికి బిందెలతో నీళ్లు తెచ్చి పోశారు. అలాగే గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, సాయంత్రం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బిగ్‌బాస్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్ బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో వేణు పంతులు, నాయకులు జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమ్య రవి, అనిల్ మొగిలి, ఎల్లేశ్, బాపురెడ్డి, రాంరెడ్డి, రమేశ్, పద్మారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఎంసీ చైర్మన్ కృష్ణ



వివరాలు తెలుసుకుంటున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణ

బెజ్జంకి(సిద్దిపేట): మద్దతుధర లభిస్తుందని కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యం బస్తాలు చోరీకి గురికావడంపై రైతులు విస్మయం వ్యక్తం చేశారు. మండలంలోని పెరుకబండలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో సహకార సంఘం డైరెక్టర్, గుండారం గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి తను పండించిన ధాన్యాన్ని 15 రోజుల క్రితం ఉంచారు. మూడు రోజుల క్రితం ధాన్యం కుప్పచేసి టార్పాలిన్ కప్పి వెళ్లారు. శనివారం వెళ్లి చూడగా ధాన్యం చోరీకి గురైనట్టు గుర్తించారు. సుమారు ఆరు క్వింటాళ్ల ధాన్యం మాయమైందని వాపోయారు. 100 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని బెజ్జంకి ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, పోలీసులు పరిశీలించారు. అనంతరం బెజ్జంకిలో నిర్వహిస్తున్న సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌లు పోచయ్య, సంతోష్, రాజు, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సురేందర్‌రావు

కొండపాక(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పీఏసీఎస్ డైరెక్టరు బుర్గుల సురేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో శనివారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా మారుతాయన్నారు. మానసిక ప్రశాంతత, శారీరక ధారుఢ్యం పెంపొందించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. సమాజంలో క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు సంపత్ కుమార్, మహేశ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్, నరేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ పాలకమండలి సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మోహినిపుర వెంకటేశ్వర ఆలయ నూతన పాలకమండలి సభ్యులు శనివారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. పాలకమండలి సభ్యులుగా బైరి నాగమణి, మనోహర్‌రెడ్డి, బుక్క గోపి, దాస శ్రీనివాస్, పండరి శ్రీమతి, తండ నవీన్, ముక్కబాబు, బుర్ర శ్రీనివాస్, పూజల బాల కిషన్, తడిసిన రమ, ఉప్పరెల్ల సంతోష, ఉమ వెంకటేశ్, వంగరి బాలరాజును రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తు, నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం ఆలయంలో ఈఓ విశ్వనాథశర్మ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ ఈనెలలో ఆలయ స్వర్ణోత్సవ వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు ఉన్నాయని, ఈ సమయంలో తాము పాలకవర్గంలో సేవలందించే భాగ్యం దక్కిడం సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట 38వ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్, గంప మహేందర్, మార్క సతీశ్, బొమ్మల యాదగిరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు స్వాముల సన్మానం



జవాన్ దంపతులను సన్మానిస్తున్న స్వాములు

చిన్నకోడూరు(సిద్దిపేట): దేశం కోసం పోరాడుతున్న సైనికులకు మద్దతుగా శనివారం మండల పరిధిలోని చంద్లాపూర్ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ మాలదారులు పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బుర్ర నరేశ్ దంపతులను ఘనంగా సన్మానించారు. సైనికులు వీరోచితంగా పోరాడాలని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మోకుజారి తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని అంతక్కపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పూదరి సాగర్ సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు జారి కింద పడిపోయాడు. దీంతో అతడిని 108లో హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు.

12న వేణుగోపాలస్వామి కల్యాణం

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని వెంకట్రావుపేటలో 12న వేణుగోపాలస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రుక్మిణి, శ్రీకృష్ణుడి కల్యాణం జరుగుతుందని. అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పీవీ రావు జయంతి వేడుకలు

సిద్దిపేటకమాన్: మాల మహానాడు ఆధ్వర్యంలో పీవీ రావు జయంతిని పురస్కరించుకుని సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ పీవీ రావు తన ఐఏఎస్ క్యాడర్ ఉద్యోగాన్ని వదులుకొని యావత్ జాతి కోసం పని చేశారని ప్రశంసించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రంతోపాటు బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో చెట్ల తొలగింపు, లూజు లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ములుగులో..

ములుగు(గజ్వేల్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చనున్న కారణంగా మండలంలోని మామిడ్యాల, ఆర్అండ్ఆర్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



యాదవ సంఘం నూతన కార్యవర్గం

చిన్నకోడూరు(సిద్దిపేట): శ్రీకృష్ణ మండల యాదవ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. శనివారం చిన్నకోడూరులో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా పరశురాములు, ఉపాధ్యక్షుడిగా పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా వెంకటనర్సయ్య, ఎల్లయ్య, కోశాధికారిగా పరశురాములు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు ఎల్లయ్య, మహేందర్, సంపత్, శ్రీనివాస్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు



అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): పురాతన ప్రాశస్త్యం కలిగిన వర్గల్ శ్రీవేణుగోపాలుని కోవెలలో శనివారం రాత్రి స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీరుక్మిణి, సత్యభామ, వేణుగోపాలస్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ ముఖ మండపంలో వేదికపై ఆశీనులను చేశారు. అర్చకులు వేదాంతం మురళీధరాచార్యులు పరివారం పుణ్యాహవాచనం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు, సేవలతో అలరారింది. వేసవి సెలవులు కావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పుణ్య స్నానాల అనంతరం దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలాచరించారు. 57 వ్రతాలు, ఆరు అభిషేకాలు, 20పైగా సేవలు జరిగినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఎల్లమ్మ జాతర కమిటీ నియామకం

హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ జాతర కమిటీని నియమిస్తూ మెదక్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.వెంకటరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 మంది సభ్యులతో కమిటీని ప్రకటించారు. వారిలో పచ్చిమట్ల రాధ, పూదరి శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీకాంత్, పెరుమాండ్ల నర్సాగౌడ్, ముప్పిడి రాజిరెడ్డి, గడిపె రమాదేవి, వీర రాజు పటేల్, బైరి శ్రీనివాస్ ముదిరాజ్, గాజుల భగవాన్ నేత, దుడ్డెల శ్రీనివాస్, సావుల వెంకట స్వామి, లావుడ్యా కైలు నాయక్, బెక్కంటి రాజయ్య, చాంతబోయిన శర్వంద రాజు యాదవ్ ఉన్నారు. 12 నుంచి జూన్ 11 వరకు ఉత్సవ కమిటీ పనిచేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓటమి జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యేపై విమర్శలు



మాట్లాడుతున్న రాంరెడ్డి తదితరులు

తొగుట(దుబ్బాక): శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయి ఓటమిని జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు ఏసీబీకి పట్టుపడ్డ నేపథ్యంలో అనుమానాలున్నాయని, విచారణ జరిపించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారన్నారు. పొరపాట్లు జరిగితే ప్రశ్నించే హక్కు ఎమ్మెల్యేకు లేదా అని నిలదీశారు. ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని, రుణమాఫీ పూర్తిచేయలేదని, రైతు భరోసా అందలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు స్వామిగౌడ్, బాలేశ్, వెంకటేశం, నరేందర్, రాంబాబు, కృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించండి



ఆందోళనకు దిగిన అల్వాల ఎస్సీ కాలనీవాసులు

మిరుదొడ్డి(దుబ్బాక): రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి నానాఅవస్థ పడుతున్నామని మండల పరిధిలోని ఆల్వాల గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నల్లపోచమ్మ కల్యాణ మహోత్సవాలు నిర్వహించడానికి విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

అమరులైన సైనికులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన సైనికులకు మండలంలోని లద్నూరు గ్రామంలో మాజీ సర్పంచ్ రామడుగు బాలరాజు ఆధ్వర్యంలో శనివారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను మట్టుపెట్టి పాకిస్తాన్‌కు వెన్నులో వణుకు పుట్టించిందన్నారు. ప్రజలంతా ఆర్మీకి మద్దతు తెలిపి దేశ ఐక్యతను చాటిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సమ్మయ్య, పుష్పాబుచ్చిరెడ్డి, నాయకులు పద్మారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.